క్లుప్తంగా

పేదలకు మరింత చేరువగా వైద్య సేవలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పేదలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలని వక్తలు పిలుపునిచ్చారు. నగరాల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పాలప్రాజెక్టు ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్వర సూపర్ స్పెషాలిటీ, హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్, దుహిత దంత వైద్యశాల, అమరావతి కంటి హాస్పటల్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, నగరాల దేవస్థాన అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావులు ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ సందర్శించి పేదలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సొసైటీ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు 600 మంది సేవలను వినియోగించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందచేశారు. సుమారు రెండు వందల మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కమిటీ ఉపాధ్యక్షులు చొక్కర శ్రీనివాసరావు, నాగోతి సత్యసంతోష్, కనిశెట్టి లక్ష్మణరావు సభ్యులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌ను అవమానించింది గాంధీ కుటుంబమే'

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మొదటి నుంచి అవమానించింది గాంధీ కుటుంబమేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని అన్నారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యాన ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. తొలుత బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్‌జీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ అంబేడ్కర్‌ను రెండు సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ పార్టీయేనని, అలాగే అప్పట్లో మంత్రిగా ఉన్న అంబేడ్కర్‌తో రాజీనామా చేయించిన ఘనతకూడా ఆ పార్టీదేనని గుర్తు చేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నేతలు ఉప్పలపాటి శ్రీనివాసరాజు, వెంకట సుబ్బయ్య, గణేష్, యర్రా సునీత, అవ్వారు బుల్లబ్బాయి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 47వ డివిజన్ పరిధిలోని గండమాల అచ్చమ్మ వీధిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు కామళ్ల జోజి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ, కట్ట ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ సందీప్, నక్కా ప్రభుదాస్, కిషోర్, యరమల ఆనంద్, బొప్పన రాంబాబు, పీ సాయి, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

నరహరిశెట్టికి అభినందన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ సర్వోదయమండలి నూతన కన్వీనర్‌గా నియమితులైన హైకోర్టు న్యాయవాది నరహరిశెట్టి శ్రీహరిని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం పలువురు అభినందించారు. న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి ,తాడికొండ కోటేశ్వరప్రసాద్, ప్రాఖ్య శ్రీరామ్, తెనాలికి చెందిన స్వామి వివేకానంద ట్రస్ట్ చైర్మన్ సాయిచరణ్ పాల్గొన్నారు.

నైతిక విలువలకు కట్టుబడిన జర్నలిస్టు మానికొండ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిజంలో నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి మానికొండ చలపతిరావు అని సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య కొనియాడారు. మిర్యాల వెంకట్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ యూసుఫ్ గూడలోని ఫంక్షన్ హాల్లో భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు (ఎంసీరావు) పుస్తకావిష్కరణ సభ జరిగింది. మేఘాలయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కొట్టు శేఖర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఆకుల అమరయ్యను సత్కరించారు. అమరయ్య మాట్లాడుతూ మానికొండ చలపతిరావు పద్మభూషణ్ అవార్డును సైతం తిరస్కరించారని గుర్తు చేశారు. ఏపీ సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, అరవ రామకృష్ణ, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ తోట గోపాలకృష్ణ, సమ్మెట నాగమల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు చందు జనార్దన్, పాశం యాదగిరి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వసంతాల చర్చిలు

- పురాతన చర్చిలకు కేంద్రంగా వన్‌టౌన్
- వన్‌టౌన్ కేంద్రంగా జిల్లాలో పలు చర్చిలు
- సామాజిక సేవల్లో భాగస్వామ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పురాతన క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు నిలయంగా 'పశ్చిమ' ఉంది. వీటిలో కొన్ని శతాధిక వసంతాల ప్రార్థనా మందిరాలున్నాయి. మరికొన్ని చర్చిలు ప్లాటినం జూబ్లీ వేడుకలను పూర్తి చేసుకున్నాయి. నగరంలో బ్రిటీష్ పాలకుల ఆధ్వర్యంలో జరిగిన రైల్వే వంతెన, కృష్ణానది ఆనకట్ట తదితర నిర్మాణాలకు వందలాది మంది ఆంగ్లో ఇండియన్స్ బెజవాడకు వచ్చారు. వారంతా తమ కోసం నగరంలోని వన్‌టౌన్ కేంద్రంగా పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ఏర్పాటు చేసుకున్నారు. కాల క్రమంలో అవి అభివృద్ధి చెంది నగరానికి వన్నె తెస్తున్నాయి. ఇవే కాకుండా వన్‌టౌన్‌లో విశాలమైన అపురూపమైన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశారు.



సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ చర్చి (ఆర్‌సీఎం)

'పశ్చిమ'లో ప్రముఖ చర్చిలు

వన్‌టౌన్ తారాపేటలో ఆర్‌సీఎం ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి కొనసాగుతోంది. ఈ చర్చికి 1884వ సంవత్సరం నుంచి ఫాదర్ జే.పయాత్తి బోధకునిగా ఉన్నట్లు అందుబాటులో ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కొన్నేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో ప్రార్థనా మందిరంగా అందుబాటులోకి వచ్చింది. ఆర్‌సీఎం సంస్థలకు జిల్లాలో మొదటి సంస్థగా పేర్కొంటారు. ఈ చర్చి పురాతనం కావడంతో మరింత ఆధునికంగా, విశాలంగా కొత్త ప్రాంగణాన్ని నిర్వాహకులు నిర్మించారు.



సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి

సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి

దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ) ఆధ్వర్యంలో గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా 'సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి'ని 1900లో స్థాపించినట్లు చర్చి ప్రాంగణంలో ఉన్న శిలాఫలకం తెలుపుతోంది. సీఎస్ఐ సంస్థల్లో దీనికి ప్రత్యేక స్థానముంది. ఈ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో వందలాది కుటుంబాలు ఉన్నాయి.

తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఇతర ప్రార్థనా మందిరాలు ఇస్లాంపేటలోని రాయల్ హోటల్ సెంటర్ వద్ద ఉన్న మరో ప్రార్థనా మందిరం 'సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి'ని 1906లో స్థాపించారు. దీని ఆధ్వర్యంలో వందలాది కుటుంబాలు కొనసాగుతున్నాయి. నగరంలో ప్రథమ లూథరన్ చర్చిగా పేర్కొనే 'సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి'ని గాంధీహిల్ వెనుక వైపు ఉన్న పాడివీధిలో 1935లో స్థాపించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. నగరంలో మొదటి ఎయిర్‌కండిషన్ చర్చి కూడా ఇదే కావడం విశేషం. ప్రైజర్‌పేటలోని 'తెలుగు బాప్టిస్ట్ చర్చి'ను 1935లో స్థాపించారు. పెజ్జోనిపేటలోని ఆర్‌సీఎం చర్చి ఏర్పాటుచేసి అర్ధ శతాబ్దం దాటింది.

సామాజిక సేవలోనూ..

నగరంలోని అన్ని ప్రముఖ చర్చిల ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పని చేస్తున్నాయి. నగరంలోని పలు విద్యాసంస్థలు ఈ ప్రార్థనా మందిరాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. వీధి బాలల సంరక్షణ, మహిళలకు శిక్షణ, ప్రాథమిక వైద్యం, వృద్ధాశ్రమం వంటి వివిధ రంగాల్లో సేవలందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధానంగా ఆర్‌సీఎం, సీఎస్ఐ సంస్థలకు చెందిన పలు విద్యాసంస్థలు నగరంలో విద్యావ్యాప్తికి పాటుపడుతున్నాయి.

అనేక సంస్థలకు వన్‌టౌన్ కేంద్రం

జిల్లాలోని వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న పలు చర్చిలకు, క్రైస్తవ సామాజిక సేవా సంస్థలకు వన్‌టౌన్‌లోని చర్చిలు కేంద్రాలుగా ఉన్నాయి. గొల్లపూడి, పెదఅవుటపల్లి, పెజ్జోనిపేట వంటి ప్రాంతాల్లో ఉన్న చర్చిలు సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చికు అనుబంధంగా ఏర్పడినవేనని వన్‌టౌన్‌లోని క్రైస్తవ ప్రముఖులు తెలిపారు.

జనవరి 1 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి

వన్‌టౌన్‌లోని వివిధ చర్చిల్లో ఈ నెల 20 నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇవి జనవరి మొదటి తేదీ వరకూ కొనసాగుతాయి. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ఆయా చర్చిలను అలంకరించారు. పర్వదినాల్లోనే కాకుండా ప్రతి ఆదివారం ఆయా క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఆరాధనకు వచ్చిన ప్రజలతో కళకళలాడుతూ ఉంటాయి.



సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి

మరింత అప్రమత్తం

దుర్గగుడి ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణల్లో అత్యంత కీలకమైన చివరి మూడు రోజులు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఆదేశించారు. దుర్గగుడికి చెందిన కీలక విభాగాల అధికారులతో ఈవో రామరావు ఆదివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. మహామండపంలో నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమై దీక్ష విరమణలపై చర్చించారు. ఆదివారం రాత్రి, సోమవారం, బుధవారం భవానీలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాల కల్పించాలని సూచించారు. ఇప్పటికే దేవస్థానం చేసిన ఏర్పాట్లు, సదుపాయాలపై భవానీలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి మూడు రోజులు అన్ని విభాగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా అమ్మవారి దర్శనంతో పాటు అన్న ప్రసాదం, ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, లడ్డూ ప్రసాదాలు, తలనీలాలు సమర్పించే చోట 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అమిత్ షా వ్యాఖ్యలు అహంకారపూరితం'

సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగంలో పేర్కొన్న అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అమిత్ షాకు తగదని హితవు పలికారు.

భవానీలకు సేవ పూర్వజన్మ సుకృతం



కేటీరోడ్డులో అమ్మవారి ఉత్సవ మూర్తి



అల్పాహారాన్ని అందిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు



నాలుగు స్తంభాల సెంటర్‌లో అన్నదానం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు విచ్చేస్తున్న భవానీలకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతమని పలువురు దాతలు పేర్కొన్నారు. కేటీ రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఆదివారం గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలకు దాతలు పండ్లు, అల్పాహారాలను పంపిణీ చేశారు. కేఎల్‌రావునగర్‌కు చెందిన వ్యాపారవేత్తలు బత్తుల రాఘవ, బాబీల ఆధ్వర్యంలో భవానీలకు అల్పాహారాన్ని అందచేశారు. బత్తుల వెంకట ప్రసాద్(లలితా ప్రసాద్) పేరిట కేటీ రోడ్డులో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసి దానిపై అమ్మవారి ఉత్సవ మూర్తికి లలితా ప్రసాద్ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భీమన వారి పేటలోని వీఎం రంగా స్కూల్ వద్ద అస్త్ర అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో భవానీలకు పండ్లు పంపిణీ చేశారు. కొత్తపేట సీఐ చినకొండలరావు. విజయదుర్గా రామలింగేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు చింతలపాటి పవన్‌కుమార్, వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవానీలకు, దుర్గమ్మ భక్తులకు సేవలందించటం ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వెలంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద భక్తులకు పండ్లు, అల్పాహారం వితరణ కార్యక్రమాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో శ్రీనాగేంద్ర స్వామి బాల భక్త సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద భవానీలు ఆగి దుర్గమ్మకు సమస్కరించుకుని వెళుతున్నారు. ఐదు రోజులపాటు సుమారు రెండు వేల మంది భవానీ భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భోజనం, బాదంపాలు అందిస్తున్నామని నిర్వాహకుడు బడుగు గణేష్ తెలిపారు. విద్యాధరపురం క్వారీ సెంటర్‌లో అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ 12వ వార్షిక ప్రసాద వితరణ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. భవానీలకు ప్రసాదాలు, భోజనాలు పంపిణీ చేస్తున్నారు.

భజే భవానీ..

భవానీ దీక్షల విరమణతో ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయి. భవానీలు పెద్ద సంఖ్యలో ఆదివారం ఇందక్రీలాద్రికి తరలివచ్చారు. జగజ్జనని నామస్మరణతో ఆలయ పరిసరాల్లోని భక్త మది పులకించింది. భవానీలు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గురుభవానీలు దీక్షల విరమణ చేయించారు. భవానీలు దుర్గమ్మ అన్నప్రసాదాన్ని భక్తితో స్వీకరించారు. ప్రసాదాల కౌంటర్లు కిటకిటలాడాయి. అధికారులు కమాండ్ కంట్రోల్ రూంలో ఉండి పరిస్థితిని అంచన వేస్తూ అవసరమైన సూచనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



దుర్గగుడి ప్రాంగణంలో భవానీలు













శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి

కేబీఎస్ కళాశాల సెక్రటరీ శ్రీనివాసు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేబీఎస్ కళాశాల సెక్రటరీ/కరస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాసు పేర్కొన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని ద టెక్స్‌టైల్ ఇండెంట్ ఏజెంట్స్ ఎడ్యుకేషన్ సొసైటీ (టీటీఐఏఎ) ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సైన్స్ కార్నివాల్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైన్స్ కార్నివాల్‌లో ప్రదర్శించిన సస్పెన్షన్ బ్రిడ్జి, రైల్ మార్గం, డ్రిప్ ఇరిగేషన్, నో నేచర్ – నో ఫ్యూచర్, హైడ్రా ఎలక్ట్రిసిటీ, భారతీయ కళా వారసత్వం, డైజెస్టివ్ సిస్టమ్, ద్విత్వాక్షర పదాలు, తెలుగు నెలలు, శాటిలైట్ కమ్యూనికేషన్స్ వంటి అనేక నమూనా ప్రాజెక్టులను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజన బహిర్గతమవుతుందన్నారు. మో ముఖ్యఅతిథి ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈమని శివ కృష్ణ మాట్లాడుతూ సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలు రావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీటీఐఏఎ హైస్కూల్ జనరల్ సెక్రటరీ/కరస్పాండెంట్ కె.పోలిశెట్టి, సొసైటీ ప్రెసిడెంట్ నంబూరు లోకేశ్వర గుప్త, టీటీఐఏఎ ప్రెసిడెంట్ ఎన్‌వీ గుప్త, సెక్రటరీ ఎంఎంకే రఘురాం, స్కూల్ ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.



సైన్స్ కార్నివాల్‌లో నమూనా ప్రాజెక్టులను తిలకిస్తున్న శ్రీనివాసు తదితరులు



విద్యార్థులు రూపొందించిన గణిత శాస్త్ర నమూనాలతో అతిథులు

రామానుజన్ స్ఫూర్తితో గణితంలో రాణించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు గణితంలో రాణించాలని పలువురు అతిథులు పేర్కొన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ప్రదర్శించిన గణిత శాస్త్ర నమూనా ప్రాజెక్టులను తల్లిదండ్రులు, సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. అతిథులు న్యాయవాది కేజేఎస్ ప్రకాష్, ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడ్వకేట్ ఆవుల వెంకట్రావు మాట్లాడుతూ గణితంలో గొప్ప తనాన్ని సాధించాలంటే రామానుజన్ మాదిరిగా సబ్జెక్టుపై లోతైన ఆలోచనలు చేయాలని సూచించారు. ఆయన 13వ ఏటే అధునాతన సిద్ధాంతాలను కనుగొన్నారని చెప్పారు. సుమారు 3900 గణిత ఫలితాలను రాబట్టారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిపూడి తరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు క్రాఫ్ట్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు క్లే, కాటన్, అట్టలతో వివిధ రకాల మెటీరియల్ ఉపయోగించి ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేశారు. ఈ పోటీలలో లిఖిత్ , హారిక, రాజేశ్వరి వరుసగా మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. చంద్రిక ప్రత్యేక బహుమతి గెలుచుకొంది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పండగల ప్రాముఖ్యత తెలియజేడంతోపాటు వారిలోని సృజనాత్మకశక్తిని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. అధ్యాపకురాలు దుర్గాభవాని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యూలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త

పట్టాలు లేక రాళ్లపైనే భవానీల నడక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొండ దిగువన క్యూలైన్లలో సరైన నిర్వహణ లేక దీక్ష విరమణలకు విచ్చేసిన భవానీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం దుర్గగుడి టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు క్యూలో ఎక్కడ చూసినా తాగి పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ కనిపించాయి. ముఖ్యంగా టోల్‌గేట్ సమీపంలోని కేశఖండన శాల వద్ద ప్లాస్టిక్ బాటిల్స్‌ను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది మచ్చకై నా కనిపించలేదు. ఇక్కడ పారిశుద్ధ్య పనుల కోసం కార్పొరేషన్ కాంట్రాక్టు కార్మికులను నియమించింది. ఉదయం, సాయంత్రం ఒక్కరే విధులు నిర్వహిస్తుండటంతో పనులు సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. ఇక్కడ వాటర్ బాటిల్స్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించే వారు లేకపోవడం గమనార్హం. మరో వైపు చైనా వాల్ నుంచి టోల్‌గేట్ వరకు క్యూలో భవానీలు నడవడానికి కార్పెట్లు ఏర్పాటు చేశారు. అవి ఎక్కడా సక్రమంగా లేవు. దీంతో భవానీలు, భక్తులు రాళ్లపైనే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితిఏర్పడింది. దీక్ష విరమణలకు విచ్చేసే భవానీల కోసం దుర్గగుడి దేవస్థానం రూ. లక్షలు వెచ్చించి క్యూలైన్లు, కార్పెట్లు వేసేందుకు కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. దీక్ష విరమణలలో అత్యంత కీలకమైన చివరి మూడు రోజులైనా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా జరగాలని భవానీలు కోరుతున్నారు.



క్యూలో తాగి పడేసిన వాటర్ బాటిల్స్

కృష్ణా వర్సిటీ యోగా జట్లు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: భువనేశ్వర్‌లోని కేఐఐటీ యూనివర్సిటీలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతీయ అంతర విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు పీబీ సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్, ఎంపిక కమిటీ చైర్మన్ మేకా రమేష్ తెలిపారు. పురుషుల జట్టుకు షాలేమురాజు, హరిశంకర్, వరుణ్, రాకేష్, శ్రీదుర్గాగౌరీనాథ్, మనిసుభాష్, మహిళల జట్టుకు జ్యోష్ణదేవి, మౌనిక, శృతి, జెబాతె హరీన్, సమీరా, చంద్రిక ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ జట్లకు మేనేజర్‌గా డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారని వివరించారు. తమ కాలేజీలో ఈ జట్లకు కిట్లను ఆదివారం అందజేశామని తెలిపారు.